బడుగులపై పిడుగు

ప్రభుత్వ నిధులతో కట్టిన నిర్మాణాల కూల్చివేత

- కూటమి నేతల కుళ్లు రాజకీయాలు
- కాలనీ అసోసియేషన్‌పై కక్షతో దుకాణాల తొలగింపు
- జీవనాధారం కోల్పోయి రోడ్డున పడ్డ పేదలు
- మద్రిపాలెం వుడా లే అవుట్ ఘటనపై స్పందించని ఎమ్మెల్యే

కూటమి నాయకుల కుటిల రాజకీయాల వల్ల బడుగులు రోడ్డున పడుతున్నారు. తమ కుతంత్రాలకు అధికారులను పావులుగా వాడుకొని పేదలపైకి ఉసిగొల్పుతున్నారు. వారి పంతాన్ని నెగ్గించుకోవడానికి దిగజారుడు చర్యలకు దిగుతున్నారు. వారి ఆదేశాలను అధికారులు అమలు చేయడంతో బడుగులు, నిరుపేదలు నిరాశ్రయులు అవుతున్నారు. అలాంటి ఘటన శనివారం జీవీఎంసీ 52వ వార్డులో వెలుగులోకి వచ్చింది. అసోసియేషన్‌పై ఉన్న కక్షతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలను కూడా నేలమట్టం చేయడం వివాదాస్పదమవుతోంది.

బతుకుతెరువు పోగొట్టారు



కుటుంబ పోషణ కోసం స్టేషనరీ, ఫ్యాన్సీ దుకాణం పెట్టుకున్నాను. దుకాణం రీమోడల్ కోసం రూ.60 వేలు వరకు ఖర్చు అయింది. నెలకు రూ.2620 అద్దె చెల్లిస్తున్నాను. సింగిల్ మదర్ అయిన నేను దుకాణం ద్వారా వచ్చే ఆదాయంతో ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నాను. ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకుండా ఖాళీ చేయించారు. సామగ్రి మూటలు కట్టడం వల్ల సగం పాడైపోయాయి. మళ్లీ షాపు దొరికే వరకు ఇంట్లో పెట్టుకోవడమే. దుకాణాలు ఎందుకు కూల్చివేశారో తెలీదు. ఆర్థికంగా నష్టపోయేలా చేయడం ఎంతవరకు సమంజసం. – కృష్ణవేణి



జేసీబీతో దుకాణాలు నేలమట్టం

మాపై ఎందుకీ కక్ష



పదమూడేళ్లుగా బార్బర్ షాపు నిర్వహిస్తున్నాను. షాపు తెరిస్తేనే కుటుంబం గడిచేది. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుకాణం తొలగిస్తున్నామని ఎవరూ మాకు చెప్పలేదు. తెల్లవారుజామునే వచ్చి సామాన్లు అన్నీ బయటకు తీసేయమంటే ఏం చేయాలో తెలియలేదు. చూస్తుండగానే దుకాణం కూల్చేశారు. ఇప్పుడు షాపు ఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదు. నెలకు రూ.3 వేలు అద్దె చెల్లిస్తున్నాను. దుకాణం తీసుకున్న తొలిరోజుల్లో అడ్వాన్స్‌గా రూ.80 వేలు కట్టాను. మాపై కక్షగట్టి ఉన్న ఫళంగా రోడ్డున పడేయటం ఎంతవరకు కరెక్టు?

– టి. నాగరాజు, సెలూన్ నిర్వాహకుడు

సమాచారం లేకుండా కూల్చేశారు



ఎన్నికలప్పుడే రాజకీయాలు. మిగతా రోజుల్లో మా కాలనీ అసోసియేషన్ నగరంలోని మిగతా అసోసియేషన్లకు రోల్‌మోడల్‌గా నిలిచేలా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. కాలనీ అభివృద్ధి, మౌలిక సౌకర్యాలు మెరుగుపరిచే విషయంలో అసోసియేషన్ పరంగా కృషి చేస్తున్నాం. ఏదైనా అనుమానాలు ఉంటే నిబంధనల మేరకు జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు నివృత్తి చేసుకునే అధికారం ఉంది. కానీ దుకాణాలు, పార్కులో వాచ్‌మెన్ క్వార్టర్ కూల్చివేయడం ఏంటి. కనీసం ముందస్తు సమాచారం ఇచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేవాళ్లం.

– సురేష్, కాలనీ అసోసియేషన్ కార్యదర్శి



క్వార్టర్ కూల్చివేయడంతో ఆరుబయట సామగ్రితో వాచ్‌మన్ కుటుంబం

విశాఖ విద్య: పార్కుల పరిరక్షణ పేరిట జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా కాలనీలో శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు దుకాణాలు కూల్చివేశారు. వుడా కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న 5 దుకాణాలను నేలమట్టం చేశారు. ఇందులో మూడు దుకాణాలు జీవీఎంసీ నిధులతో నిర్మించినవి కాగా, రెండు దుకాణాలు కాలనీ అసోసియేషన్ వారు నిర్మించారు. వీటితో పాటు రాత్రి వేళ అపరిచిత వ్యక్తులు పార్కులోకి రాకుండా.. పరిరక్షణ నిమిత్తం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాచ్‌మెన్‌ను నియమించారు. అతను నిత్యం అక్కడే ఉండేలా క్వార్టర్ కూడా నిర్మించారు. **జోన్–5 టౌన్ ప్లానింగ్ అధికారి శాస్త్రి నేతృత్వంలో** సచివాలయ సిబ్బందితో కలిసి పోలీసు బందోబస్తు నడుమ బలవంతంగా దుకాణాలను ఖాళీ చేయించారు. అనంతరం దుకాణాలను జేసీబీలతో కూల్చివేయించారు. దీంతో వాచ్‌మెన్ కుటుంబం రోడ్డున పడింది. సామగ్రి తీసుకునేందుకు సమయం ఇవ్వకుండా ఉన్న ఫలంగా బయట పడేసి పొక్లెయిన్‌తో క్వార్టర్‌ను పూర్తిగా నేలమట్టం చేశారని వాచ్‌మెన్ కుటుంబం వాపోయింది. ఈ చర్యలను స్థానిక ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినా ఆయన ఫోన్‌కు స్పందించలేదని కాలనీ అసోసియేషన్ సభ్యులు వాపోతున్నారు.



బయట పడేసిన సరుకులను ఏరుకుంటున్న దుకాణదారుడు

జీవీఎంసీతో అగ్రిమెంట్ ఉన్నా..

అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులు శివశివానీ స్కూల్‌కు సమీపంలోని పార్కు వద్ద దుకాణంలోని సరుకులు, ఇతర సామగ్రి బయట పడేసేందుకు సిద్ధమయ్యారు. ఇదే ఆధారంగా బతుకుతున్న తమను రోడ్డున పడేస్తే, ఆత్మహత్య చేసుకుంటామని దుకాణదారులు కన్నీటి పర్యంతమయ్యారు. పార్కు అభివృద్ధి, నిర్వహణలో భాగంగా దుకాణం నిర్వహణకు జీవీఎంసీతో అగ్రిమెంట్ చేసుకున్నామని, దీన్ని ఎలా తొలగిస్తారని కాలనీ అసోసియేషన్ సెక్రటరీ సురేష్, ఇతర సభ్యులు టౌన్ ప్లానింగ్ అధికారుల తీరును తప్పుపట్టారు. దీంతో అధికారులు ప్లాన్ మేరకు దుకాణం మధ్యలో గోడ ఉండటానికి వీల్లేదన్నారు. దీంతో గోడను తొలగించారు.

ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా దుకాణాలు ఖాళీ చేయించడంపై వాటి నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. రోజువారీ వ్యాపారం చేసుకునేందుకు తెచ్చుకున్న సరుకులను భద్రపరుచుకునేందుకు కూడా గడువు ఇవ్వకుండా, తొలగించడమేంటని ప్రశ్నించారు. తమకు పై నుంచి ఆదేశాలు ఉన్నాయని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, లేకుంటే కేసులు పెడతామని టౌన్ ప్లానింగ్ అధికారులు బెదిరింపులకు పాల్పడ్డారు. సచివాలయ సిబ్బందితో దుకాణాల్లోని సరుకులు, ఇతర సామగ్రి జీవీఎంసీ వాహనాలపైకి ఎక్కించి, అక్కడ నుంచి తరలించారు. మెడికల్ షాపులో మందులను మూటలు కట్టి, వాహనాలపైకి ఎక్కించారు.

ఎందుకీ విధ్వంసం

మద్రిపాలెం వుడా లే అవుట్‌లో ఉన్న పార్కుల వద్ద దుకాణాల తొలగింపునకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చేసిన హడావుడి ప్రజానీకంలో అనేక అనుమానాలు కలిగిస్తోంది. దుకాణాల తొలగింపులో భాగంగా విద్యుత్ కనెక్షన్లు కట్ చేయాలని ఈ నెల 25న జీవీఎంసీ జోన్–5 కమిషనర్ నుంచి విద్యుత్ శాఖ ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ ఏఈకు లేఖ రాశారు. ఇదే రోజు కార్యాలయంలో కింద స్థాయి నుంచి కమిషనర్ వరకు ఫైల్ చకా చకా సర్క్యులేట్ అయిపోయింది. వెంటనే విద్యుత్ శాఖ కార్యాలయానికి పంపించారు. ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకుండానే శనివారం దుకాణాలను తొలగించడంలో ఆంతర్యమేమిటనేది చర్చనీయాంశమైంది. మద్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు మద్దతుగా నిలుస్తున్నారనే అక్కసుతో, ఈ రీతిన కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారనే ప్రచారం సాగుతోంది. అసోసియేషన్‌లో ఆర్థిక పరమైన లావాదేవీలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నిగ్గు తేల్చాలి. కానీ కొంతమంది కూటమి నాయకుల కుళ్లు రాజకీయాలకు కాలనీలో విద్వేషాలు పెరుగుతున్నాయని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉదయం దుకాణాలు తొలగించగా, మధ్యాహ్నం తర్వాత కూటమి పార్టీకి చెందిన ఓ బిల్డర్ ఆ ప్రాంతానికి వచ్చి మళ్లీ దుకాణాలు కొత్తగా నిర్మించి ఇస్తామని చెప్పడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.



దుకాణాల తొలగింపు వద్ద పోలీసు బందోబస్తు



దుకాణాల్లోని సామగ్రిని వాహనాలపై ఎక్కిస్తున్న సచివాలయ సిబ్బంది

క్లుప్తంగా

మరణించి.. మరొకరికి వెలుగునిచ్చి..



రంగమ్మ (ఫైల్)

మల్కాపురం: మరణం తర్వాత కూడా మరొకరికి వెలుగును పంచింది ఓ మహిళ. మల్కాపురం పల్లి వీధికి చెందిన 74 ఏళ్ల మల్లెడి రంగమ్మ చేసిన ఈ కంటి దానం చేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. అనారోగ్యంతో బాధపడుతున్న రంగమ్మ, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తాను బతికే అవకాశాలు తక్కువ అని గ్రహించిన ఆమె, తన కుమార్తె ,అల్లుడికి తన మనసులో మాట వెలిబుచ్చింది. తాను మరణించిన తర్వాత తన శరీరంలోని ఉపయోగపడే అవయవాలను దానం చేయాలని కోరింది. శనివారం ఉదయం రంగమ్మ తుది శ్వాస విడిచారు. ఆమె చివరి కోరికను గౌరవిస్తూ రంగమ్మ రెండు కళ్లను డాక్టర్ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మల్కాపురం: మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించడానికి టెక్నాలజీని వినియోగించాలని జేఎన్‌టీయూ (విజయనగరం) రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సును మహిళలు తమ రక్షణ,సాధికారతకు సాధనంగా వినియోగించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కె.సంజీవరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

మైదానం అభివృద్ధి పనులు వేగవంతం



హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడామైదానం అభివృద్ధి పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వ విప్ గణబాబు చెప్పారు. జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ గ్రౌండ్ క్రీడాకారులకు అనువైన విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అన్ని వర్గాల వారు ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం



మాదక ద్రవ్యాల వల్ల నష్టాలను విద్యార్థులకు వివరిస్తున్న ఎస్‌ఐ అప్పలనాయుడు

గోపాలపట్నం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు సూచించారు. సీఐ ప్రభాకర్ ఆదేశాల మేరకు హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి ఎస్‌ఐ వివరించారు. విద్యార్థి దశలో ఆకర్షణలకు లోనవుతారన్నారు. సిగరెట్లు, గంజాయి, మద్యం వంటివి ముందు సరదాగానే మొదలుపెడతారని, కానీ తర్వాత వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటారని అన్నారు. ఆ ఆకర్షణలకు లోను కావద్దని హితవు పలికారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏం ఇచ్చినా తీసుకోవద్దన్నారు. ఆడపిల్లలను ఎవరైనా అల్లరి చేసినా, అసభ్యకరంగా ప్రవర్తించినా ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. లేదా 112కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే మహిళలకు ఎంతో భరోసానిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోండి

- వివక్ష చూపుతున్న వారిపై అట్రాసిటీ కేసు పెడతా..
- 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి 62వ వార్డులో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు శనివారం 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తాను స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నప్పుడు వార్డులో సామాజిక భవనాలు, మంచి నీటి పైప్‌లైన్లు, రక్షణగోడలు, మెట్ల మార్గాలు, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణాలు కూడా పూర్తి చేశామన్నారు. అయితే తనకు కనీస సమాచారం లేకుండా ప్రారంభోత్సవాలు చేసేశారని, శిలాఫలకంలో కూడా తన పేరును అవహేళన చేసినట్టు ముద్రించారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు ప్రథమ పౌరుడిగా వార్డులో జరిగే ప్రతి అధికారిక కార్యక్రమానికి సమాచారం ఇవ్వాలని, కానీ అధికారులు టీడీపీ నాయకులతో కుమ్మక్కై ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. దళిత కార్పొరేటర్ అని తనను చిన్నచూపు చూస్తూ పలు విధాలా అవమానాలకు గురిచేస్తున్న సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవమానాలకు గురి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా పెట్టబోతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్‌యార్డులో కొత్త అగ్నిమాపక కేంద్రం



మాట్లాడుతున్న రియర్ అడ్మిరల్ శ్రీనివాస్

సాక్షి, విశాఖపట్నం : భద్రతా వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు నేవల్ డాక్‌యార్డు నిరంతరం శ్రమిస్తుందని వైజాగ్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్(ఏఎస్‌డీ) రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ తెలిపారు. డాక్‌యార్డులో నూతన అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ఏఎస్‌డీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కొత్త కేంద్రం అందుబాటులోకి వస్తే.. మెరుగైన సౌకర్యాలతో అగ్నిమాపక బృందం సేవలు అందించేందుకు వీలవుతుందని రియర్ అడ్మిరల్ శ్రీనివాస్ వెల్లడించారు.

పర్యావరణ ప్రేమికులు



వెంకటాపురం కొండవాలు ప్రాంతాల్లో విత్తన బంతులు విసురుతున్న విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కొండవాలు ప్రాంతాల్లో విత్తన బంతులు చల్లారు. జేడీ ఫౌండేషన్ సభ్యులు విత్త బంతులు తయారు చేసే విధానం వాటివల్ల కలిగే లాభాల గురించి వివరించారు. చెట్ల వల్ల పర్యావరణ సమతుల్యం కలుగుతుందని తెలిపారు. గాలినాణ్యత పెరగడంతో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయని చెప్పారు. విత్తన బంతులను గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థులు తయారు చేశారని.. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జేడీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి



మహాసభల్లో మాట్లాడుతున్న సిటు నాయకుడు అజశర్మ

- సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పిలుపు
- ఘనంగా సిటు జిల్లా 13వ మహాసభలు



సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కంచరపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. కంచరపాలెంలోని ఒక కమ్యూనిటీ హాలులో శనివారం సీఐటీయూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. మోదీ విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజధాని నిర్మాణానికి మరో 40 వేల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా విధానాలపై వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే మరిన్ని పోరాటాలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని తీర్మానం చేశారు. అంతకు ముందు సీఐటీయూ పూర్వ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.పద్మనాభరాజు సిటు పతాకావిష్కరణ చేశారు. ప్రజానాట్య మండలి కళాకారులు కార్మికులను ఉత్తేజపరుస్తూ అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎ.అజశర్మ, కె.లోకనాథం, ఆర్.శంకరరావు, ఎం.శ్రీనివాస్, పి.మణి, పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, ఎల్.జె.నాయుడు, వై.సత్యవతి, చిరంజీవి, ఎం.చంటి, తదితరులు పాల్గొన్నారు.

'ఆది కర్మయోగి' శిక్షణ పూర్తి



ఆది కర్మయోగి శిక్షణ పూర్తి చేసుకున్న నాలుగు జిల్లాల అధికారులు

తాటిచెట్లపాలెం: గిరిజన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆది కర్మయోగి' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గిరిజన గ్రామాభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు రూపొందించిన ఈ కార్యక్రమంలో భాగంగా, విశాఖలోని బెస్ట్ వెస్ట్రన్ హోటల్‌లో ఈ నెల 23న ప్రారంభమైన రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పూర్తి చేసుకున్న జిల్లాల అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు చిత్తశుద్ధితో 'ఆది కర్మయోగి' కార్యక్రమ లక్ష్యాలను సాధించే దిశగా వివిధ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను, శిక్షణ అందించిన రిసోర్స్ పర్సన్‌లను అభినందించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు పీవీఎస్ నాయుడు, పి. మురళీధర్, డాక్టర్ ఎం. రమేష్ బాబు, ఎస్.వై. నూరాని, కె.సురేష్ బాబు, పి.వనజ, ఎం. ఉమాపతిలతో పాటు డాక్టర్ ఆర్. కృష్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పూర్తి జీతాలు చెల్లించాలని ధర్నా

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉద్యోగులకు పూర్తి జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉక్కు ఎల్‌డీసీ విభాగం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోయినా యాజమాన్యం ఇచ్చిన 7.3 మి.ట లక్ష్యం కోసం ఉద్యోగులు అనేక ఇబ్బందులను అధిగమించి ఉత్పత్తి కొనసాగిస్తున్నారన్నారు. అయినా యాజమాన్యం ఉద్యోగులకు 305 శాతం జీతం పెండింగ్‌లో పెట్టిందన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వర రావు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 40 ఏళ్ల వయసు గల వారికి మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు.